# పందిట్లో పెళ్ళవుతున్నదీ....

జానకి అద్దం ముందు నిలుచుంది.... ఛీ, ఎంత నలుపో, ఫెయిర్ అండ్ లవ్లీ రాసుకుంటే...జానకికి చిన్నప్పటి పద్యం గుర్తొచ్చింది. 'ఎలుగు తోలు తెచ్చి ఎందాక ఉతికినా!" అయినా లోకంలో అంతా తెల్లగానే ఉన్నారా? జానకి డ్రెస్సింగ్ టేబులు ముందున్న పౌడరు తీసి ముఖం నిండా పూసుకుంది., ఛీ....ఎంత అసహ్యంగా ఉందో....ముఖం గబగబా కడుక్కుంది...ఏదో చిరాకు!

వీళ్ళకి మాత్రం తను నచ్చుతుందా! నల్లని నలుపు, పిల్లి కళ్ళు! ఆ పిల్లి, ఎంత ముద్దుగా ఉంది గుమ్మంలో కూచుంటే, దీని చిన్న కళ్ళు నీలం రంగుగా, పచ్చగా, కొన్నిసార్లు తెల్లగా మెరిస్తూ కనిపిస్తాయి...ఏం దానికళ్ళు అందంగా లేవా?

'ఇదేమిటీ ఇంత డార్క్ కలరా....ఆ లైట్ కలర్ చీర కట్టుకో' ...ఎవరు నాకు చెప్పేది. నా ఇష్టం, నల్లచీర కట్టుకుంటా... ఈ అద్దం ఊహ తెసినప్పటించి తనకి తెలుసు. తను గౌన్లు వేసుకునేటప్పుడు, తను ఓణీలేసుకునేటప్పుడు, చీరకట్టుకుంటున్నప్పుడు. ఎప్పుడు ఒక్కసారయినా నిజం చెప్పదేం. నేను బాగుండనా, ఆ అద్దాన్ని దువ్వెనతో ధనా, ధనా కొట్టింది...రెండు చోట్ల బీట్లు తీసి ముక్క విరిగి పడింది...!

'రెడినా?' వంటింట్లోంచి కేక.

'రెడియే.' జానకి అరిచింది.

'ఏమిటా అరుపు, నెమ్మదిగా మాట్లాడు' అంది వంటింట్లోంచి తల్లి.

జానకి కిటికీలోంచి చూస్తోంది. అబ్బ ఎంత అందంగా ఉన్నాడో!

జానకి పెళ్ళి కొడుకు ముందు తలొంచి కూర్చుంది అవి పెళ్ళుచూపులు. అదేదో సినిమా గుర్తొచ్చింది...జానకికి నవ్వు...అయ్యో, ఇప్పుడు నవ్వుకూడదు. నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంది... దగ్గు వస్తున్న వంకతో లోపలికెళ్ళింది. అద్దం ముందు గలగలా నవ్వేసింది...నేను నవ్వితే ఏమిటీ, ఏడిస్తే ఏమిటీ? ఈ సంబంధం ఎలాగూ కుదరదు.

జానకికి ఉన్నట్టుండి విజయ్ గురొచ్చాడు...అతను మెల్లకన్నున్న, నల్లని పిల్లని పెళ్ళాడాడు. ఎందుకంటే...

'ఆ భార్య రూపవతీ శత్రుః' అన్నాడు...మా అమ్మమ్మ చెప్పింది కులమింటి కోతిట...

కోతి! ఎంతబాగా ఆడిందో, కర్ర పట్టుకుని భుజాన పెట్టుకుంది. గొడ్లు కాస్తుందిట. దాని ముఖం...ఛీ, ఎవరి ముఖాన్ని ఏమీ అనకూడదు. కోతి ముఖం అంటాం మరి దానికి కోపం రాదూ!

మనసు గతి యింతే, మనిషి బతుకింతే! ఈపెళ్ళివారూ, ఓ పాట పాడమనరేం?

ఓ పాట పాడమ్మా...అంది అత్తగారు...నాన్సెన్స్! అత్తగేరేమిటే? ఆలు లేదు చూలు లేదు, అల్లుడి పేరు సోమలింగంట. పెళ్లి చూపులు...నచ్చదు, సంబంధం కుదరదు..అత్తగారా?

"పాటలు రావండి!" జానకి నెమ్మదిగా అంది.

పెళ్ళివారెళ్లిపోయారు....

హమ్మయ్య! జానకి గబగబా గదిలోకి వెళ్ళిపోయింది. ఈ సంబంధం కూడా కుదరదు.పిల్లి కళ్ళు, జానకి పగలబడి నవ్వింది. పొద్దున్న పేపర్లో చదివిన విషయం .గుర్తొచ్చింది...క్లోనింగ్...ఆహా....జన్యుశాస్త్రమా! నీకు జోహార్లు...ఆహా...తెల్లగా పాలకోవాలా, హంసలా! ..తెల్లగా....దయానాలా ...అందంగా...పొడుగ్గా.....అయిపోవచ్చు...అప్పుడు తను చెపుతుంది... ఛీ! నల్లగా ఉన్నావ్...నిన్ను పెళ్ళాడను!...నా ఇష్టం! ఎర్రజుట్టు, తెల్లకళ్ళు, పొడుగు...ఓహో! ఏం ఎవరు చెప్తారు ఇప్పుడు...ఏం జరుగుతుందో!ఆరడుగుల అందగాళ్ళేనా' ఆరడగుల అందగత్తెలు కావద్దూ? వాళ్లల్లో నేనొక్కర్తినే...

జానకి ముఖం ఒక్కసారి కోపంతో మండిపోయింది....నల్లటి వాళ్ళకి కోపం రాదా! తెల్లని వాళ్ళయితే ముఖం ఎర్రగా కందగడ్డలా మారిపోయిందంటారూ...నల్లటోళ్ళకి కోపం వస్తే ముఖం ఎలా వర్ణిస్తారు. వాళ్ళ ముఖం!

జానకి కోపంతో ఊగిపోయింది. ఛీ! అందాల పోటీలా! కోలకోల పోటీలా! సిగ్గులేదూ? కాట్‌వాక్‌ట! కిరీటాలూ, కిలకిలలు ఓహో! అయినా అదేమిటీ మొన్న రాణి, తన ఫ్రెండ్ వచ్చి దంతక్షయాలు, నక్షయాలు అని ఒకటే చెప్పి నవ్వించింది. నవ్వు కాదు, జుగుప్స...అయినా కొరకడాలు...గిచ్చాడాలూ,...నేనయితే చచ్చినా ఒప్పుకోను. ముద్దు పెట్టుకోవాలి...అసలు మొగుడేడీ!...జానకి ఫాన్ కేసి చూసింది.

'జానకీ, జానకీ' వంటింట్లోంచి తల్లి కేక. మళ్ళీ మరో పెళ్ళి సంబంధం ..... 'ఏమిటీ...'

' ఈ కూరలో పోపు పెట్టి, చారు చెయ్యి' అంది సిగలో పిన్నులు సరిచేసుకు లేస్తూ.

'నువ్వెక్కడి కెడుతున్నావ్!'

'ఎక్కడి కెడతానూ...మీ నాన్న దగ్గర పది నిమిషాలు కూచుని...' అంటూ తల్లి వెళ్లిపోయింది.

పది నిమిషాలు కాకపోతే పది గంటలు కూచో ఎవడొద్దన్నాడూ? నువ్వు నాన్న దగ్గరగా కూచుని కబుర్లు చెప్పు, నేను కూర చేసి చారు పెడతా! నాకు మొగుడా మొద్దులా! జానకి కోపంగా పోపు పెట్టింది...స్టౌ దగ్గరగా నిలబడింది...చీర కొంగు గాలికి అటూ ఇటూ కదులుతోంది.

కొంగు అంటుకుని చచ్చిపోయింది కదూ పిన్నికూతురు...దాని మొగుడు హాయిగా మరో దాన్ని పెళ్ళి చేసుకోలా...ఏమిటో, నా కెందుకు పెళ్లి కాదో!

జానకి చీర కొంగు అంటుకుంది. 'అమ్మో అదేమిటి?....' తమ్ముడు వంటింట్లో మంచినీళ్ళ కోసం వచ్చి గబుక్కున జానకిని దూరంగా లాగి చీర కొంగు గట్టిగా నలిపేశాడే.

రేపు పేపర్లో వచ్చేది. ఏమిటీ... నల్లగా, పిల్లికళ్ళున్న అమ్మాయి' జానకికి ఎందుకో పెద్దగా ఏడవాలనిపించింది, తను బతికే ఉందిగా, ఏడవడం దేనికీ? ఏడవడం దేనికేమిటీ,. ఊరికేనే ఏడవచ్చు నిన్న వీధి సందు చివర కుక్క పిల్ల ఏడ్చింది కాదూ! మొన్న అమ్మ ఏ మాట నాన్న వినడని ఏడ్చింది. బావ తిడితే అక్క ఏడ్చేదికాదూ?

జానకి ఆ రోజు వీధి గుమ్మంలో నిలబడి వచ్చేపోయే వాళ్ళని చూస్తోంది.... రోడ్డుకి అటువైపున ఒకావిడ ఆటో దిగింది. అబ్బ ఎంత కడుపో, రేపో, ఎల్లుండో పురుడు వస్తుందిలా ఉంది... ఆ ప్రక్కనున్నవాడు మొగుడే! ఎంత కాకిలా, నల్లగా ఉన్నాడో, ఈవిడ ఎంత బావుందో, ఇదే కాకి ముక్కుకీ దొండ పండు అంటే! ఆ పుట్టే పిల్ల నల్లగా తండ్రి లాగా పుడితే...బాబోయ్!

జానకి అలాగే చూస్తోంది...సుందరి, సుందరి...తన ఫ్రెండ్..ఎనిమిదో క్లాస్‌లో ఫ్రెండ్. అదేమిటీ, సుందరీ ఈ నల్లని మొద్దు...అలాంటి అందగత్తెకి అలాంటి వాడొస్తే నాలాంటి దానికి...జానకి అలా వీధి గుమ్మంలో నిలబడి చూస్తూ పకపకా నవ్వింది. ఆటో ఎప్పుడో వెళ్ళిపోయింది. ఆ జంట ఎటో వెళ్ళారు.

వారం రోజులయింది...ఇంక ఈ పెళ్లి సంబంధమూ కుదరదు. ఇక తనకి పెళ్ళి కాదు. పిలక జడేసుకుని, పిచ్చి చెప్పులేసుకుని, గుడ్డ సంచీ పట్టుకుని, కూరలకెడుతూ వస్తూ...అంటే! జానకి వంటింట్లో కూర తరగడం ఆపేసింది.

గదిలో తల్లితండ్రి పెద్దగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు మాట్లాడుకున్నట్లు పోట్లాడుకుంటూన్నారు. పోట్లాడుకుంటున్నట్టు మాట్లాడుకుంటున్నారు. అయినా తనకేం! జానకి ఆలు ముక్కలు పెద్దవిగా తరిగేసింది. బెండకాయలు తరిగింది. ఈ రెండు వేళ్లూ తెగిపోతే లేడిస్ ఫింగర్లట!

గబగబా ముస్తాబయింది. లేత గులాబీ రంగు చీర కట్టుకుంది. చిన్న బొట్టు పెట్టుకుంది...తెల్లని మల్లెపూల పెద్ద దండ జడలో పెట్టుకుంది. అద్దం ముందు నిలబడింది. ఎంత బావుంతో తను నలుపైతేనేం, మహాలక్ష్మిలా ఉంది అంటుంది అమ్మమ్మ, ఆ మహాలక్ష్మి ఎవరో! ఏమో!

'జానకి, జానకీ' అంటూ తల్లి హడావుడిగా గదిలో కొచ్చింది. "హమ్మయ్య, వాళ్ళు కబురు చేశారు. అబ్బాయికి నువ్వు నచ్చావుట,' జానకికి తల తిరిగినట్టయింది. తను నచ్చిందా! ఆ అబ్బాయికి తను నచ్చిందా! ఒఠ్ఠ అబద్ధం! ఇందరికి నచ్చని తను ఇతనికెలా నచ్చిందీ! అమ్మో! ఇందులో ఏదో మోసముంది...జానకి మనసు నమ్మడం లేదు.

'అదృష్టమంటే ఇదే. ఎంత చక్కగా ఉన్నాడో పిల్లాడు. ఎన్ని సంబంధాలో చూశాడట...ఎందుకో మరి ఎవరూ నచ్చలేదు, మన జానకి నచ్చిందన్నాడు...అదే కళ్యాణమొచ్చిన కక్కొచ్చినా ఆగదంటారుజానకి మామయ్య పెద్ద గొంతుతో అంటున్నాడు తల్లితో.

ఇంట్లో అంతా చాలా సంతోషంగా ఉన్నారు. పిల్ల పెళ్ళి కుదిరిపోయిందని. రాత్రంతా జానకికి ఇదే ఆలోచన....తను నచ్చింది! ఎంత మోసం! ఏదో ఉంది ఇందులో, మంచి కుటుంబమని తనని ఇష్టపడ్డాడు. ఏం మంచి కుటుంబమనేనా? తను నచ్చడమేమిటీ? జానకి అటూ ఇటూ ఒత్తిగిల్లింది... లేచింది, సందులో జాజి పందికిరింద కూచుంది....చీకటి! ఈ చీకటి ఎంత నలుపో! జానకి కళ్ళు బాగా తెరుచుకు చూసింది...!

జానకి కళ్ళ ముందు కోతిపిల్ల, నల్లపిల్లి! బాబోయ్ కళ్ళు గట్టిగా మూసుకుంది. లోపలికి పరిగెత్తి దుప్పటి కప్పేసుకుంది. తెల్లారిందగ్గరి నుంచి ఒకటే భయం! భయమేమిటీ! ధైర్యంగా చెప్పేస్తే...మనసుని దిట్టపరచుకునే ప్రయత్నంలో ముఖాన చెమటలు పట్టాయి.

'నాకు నచ్చలేదు' నూతిలోంచి వస్తున్న మాటల్లా నున్నాయి జానకి మాటలు.

తల్లీ...తండ్రి జానకి ఏమంటోందో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు....

నల్లపిల్ల, పిల్లిగుడ్లు....తన పోలికతోనే పుడితే పిల్లలు! జానకికి డాక్టరు దుర్గాంబ గుర్తొచ్చింది. అంతే ఆవిడని సాక్షాత్తూ అమ్మవారు. దయాస్వరూపిణి, మా ప్రాణాలు కాపాడే అమృతమయి..అంటూ పాదాలమీద పడతారు.... ఆ దుర్గమ్మ డాక్టరుగారు ఎన్ని పురుళ్ళు పోసిందో, తల్లి, బిడ్డల్ని ఎందర్ని కాపాడిందో... ఆ దుర్గమ్మగారు నల్లగా, పళ్ళెత్తుగా, మెల్లకన్నుతో...అయితేనేం? అసలు రంగెందుకూ? తన నల్లపిల్ల...ఏదీ? అదే పుట్టే నల్లపిల్ల తనకి ముద్దే! జానకి కొంగు నోటికడ్డంపెట్టుకుని వచ్చే నవ్వు ఆపుకుంది.

అయినా రంగులన్నీ పిచ్చోళ్ళ మాటలు. తనేమైనా పిచ్చిదా!

'పందిట్లో పెళ్ళవుతున్నదీ, కనువిందువుతున్నదీ...! సినిమా పాట నెమ్మదిగా కూనిరాగం తీసింది జానకి.

"ఏమిటీ కూనిరాగాలు, అతను వస్తాడు ఇప్పుడు నీతో మరోసారి మాట్లాడుతాడట" ఒంటింట్లోంచి తల్లి కేకపెట్టింది.

మరోసారి మాట్లాడుతాడా సరే నేను మరోసారి చూస్తాను. నిజంగా బాగా తెలుపా! కొంచెం తెలుపా? కిటికీ దగ్గర నిలబడి వచ్చే అతని కోసం చూస్తోంది జానకి.

పెళ్ళి ముహూర్తం సమీపించింది.... పెళ్లి పందిట్లో సందడి....

పందిట్లో పెళ్ళవుతున్నదీ...పాట వినపడుతోంది....జానకి అనుకుంది.

'ఈ అబ్బాయి తెల్లగానే ఉన్నాడు, నన్నిష్టపడే చేసుకుంటున్నాడు' పెళ్ళి కూతురు బుగ్గల్లో సిగ్గు దొంతరలు పూచాయి.......

– ఆంధ్రప్రభ ఆదివారం మే 19, 2002